క్లుప్తంగా

కన్నులపండువగా సదస్యం



ఆలయంలో నిర్వహిస్తున్న సదస్యం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో సోమవారం సదస్యం కార్యక్రమాన్ని వేద పండితులు, అర్చకులు కన్నులపండువగా నిర్వహించారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు. వేకువజామునే స్వామి వారి గ్రామోత్సవం జరిగింది. పలు కార్యక్రమాలు వేదపండితులు మంత్రపఠనంతో నిర్వహించారు. వేకువ జాము నుంచే భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య ఆధ్వర్యాన ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మేనకేశ్వరుడికి అభిషేకాలు

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన పార్వతీ సమేత మేనకేశ్వర స్వామి, రుక్మిణీ సత్యభామా సమేత కృష్ణరాయుడు స్వామి వార్ల కల్యాణంలో భాగంగా సోమవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక బుచ్చి ఆధ్వర్యంలో సదస్యం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



వీవీమెరక శివారు కేవీపోడు పాఠశాలలో వంటకాన్ని పరిశీలిస్తున్న కృష్ణకిరణ్

సఖినేటిపల్లి/మలికిపురం: మండలంలోని ఉయ్యూరువారి మెరక శివారు కంతేటివారిపోడులో ప్రాథమిక పాఠశాల, మలికిపురంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఏపీ ఫుడ్ కమిషన్ మెంబర్ జె.కృష్ణకిరణ్ తనిఖీ చేశారు. పథకంలో భాగంగా వండుతున్న వంటకాలను ఆయన పరిశీలించి రుచి చూశారు. పథకాన్ని మరింత బాగా నిర్వహించాలని పాఠశాల బోధన సిబ్బందికి సూచించారు. ఎంఈవో నల్లి మనోహరం, పాఠశాల స్టాఫ్, డీఎస్‌వో ఎ.పాపారావు, ఏఎస్‌వో వై.ప్రతాప్‌రెడ్డి, డీటీ శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో స్టాక్ రిజిస్టర్‌లోని సరుకులను కూడా పరిశీలించారు. ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

పి.గన్నవరం: శ్రీరామ నవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక మూడు రోడ్ల సెంటర్లో శ్రీసీతారామ వర్తక సంఘం ఆధ్వర్యంలో సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. మధ్యాహ్నం 3 గంటల వరకూ షాపులను మూసివేసి, వ్యాపారులు సేవలు అందించారు. సంఘ అధ్యక్షుడు తెలగారెడ్డి అగ్గి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు రాలింగి రామకోటేశ్వరరావు, నాయకులు తమ్మన ప్రసాద్, గిడుగు బాబ్జీ, షేక్ దొరబాబు, కట్టా గోపి, కదలి శ్రీను, సంఘ సభ్యులు, వ్యాపారులు పాల్గొన్నారు.

జ్యోతిషరత్న అవార్డు స్వీకరణ

ఆలమూరు: మండలంలోని సంధిపూడికి చెందిన ఇలపర్తి వెంకటేష్ జ్యోతిషరత్న అవార్డు స్వీకరించారు. జ్యోతిష రంగంలో ఉన్న విశేష అనుభవాన్ని గుర్తించిన విజయవాడకు చెందిన విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ సోమవారం స్థానిక గోల్డెన్ వే హోటల్‌లో జ్యోతిష రంగ పండితుల చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మేడపాటి లక్ష్మణరావు (బాబీ), వారణాసి బ్రహ్మాజీ, గుండు బ్రహ్మన్న, మండల బ్రాహ్మణ సంఘ సమాఖ్య సభ్యులు అభినందనలు తెలిపారు.

మోటారు సైక్లిస్టుకు గాయాలు

అంబాజీపేట: అంబాజీపేట శివారు జయంతినగర్ మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. కె.పెదపూడికి చెందిన చిట్టిగుళ్ల భరత్ తన బైక్‌పై అంబాజీపేట వస్తున్నాడు. గంగలకుర్రు నుంచి రావులపాలెం వైపు వెళుతున్న ఇటుక లోడు ట్రాక్టర్ జయంతినగర్ మలుపు వద్దకు వచ్చేసరికి ఢీ కొట్టడంతో భరత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో అమలాపురం ఆస్పత్రికి తరలించారు.

సర్పంచ్‌ను గాయపర్చిన వ్యక్తిపై కేసు

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురు సర్పంచ్‌ను గాయపర్చిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. కొండుకుదురుకి చెందిన పెంటా శ్రీనివాసనాయుడు, పెంటా విశ్వేశ్వరరావులు చీటీ పాట సొమ్ము విషయంలో గొడవ పడుతున్నారు. వీరిని వారించేందుకు సర్పంచ్ మేడిద దుర్గాప్రసాద్ ప్రయత్నంచారు. ఈ సందర్భంలో శ్రీనివాస నాయుడు సర్పంచ్ దుర్గా ప్రసాద్‌ను గాయపర్చిచాడు. దీనిపై సర్పంచ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రొయ్యల చెరువు తవ్వకాలు నిలిపేయాలి

అయినవిల్లి: మండలంలోని పోతుకుర్రులో రొయ్యల చెరువు తవ్వకాలను నిలిపివేయాలని ఆ గ్రామస్తులు అమలాపురంలో స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో తాగునీరు కలుషితం అవుతుందని, పంటభూములు బీడు భూములుగా మారుతాయన్నారు.

రాగిజావతో సంపూర్ణ ఆరోగ్యం

- పాఠశాలల్లో గోరుముద్ద పథకంలో భాగంగా అందజేత
- విద్యార్థుల సమగ్ర ఎదుగుదలకు దోహదం



అంబాజీపేటలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు (ఫైల్)

అంబాజీపేట: జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో బెల్లపు రాగిజావను చేర్చడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. రాగిజావ, బెల్లంలో కాల్షియం, ఐరన్ ఎక్కువగా ఉండడం వల్ల విద్యార్థుల్లో చురుకుదనం పెరగడమే కాకుండా ఎముకల పుష్టి వస్తుంది. తద్వారా బాగా చదవడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి సంపూర్ణ పోషకాహారం అందించాలన్న దృఢ సంకల్పంతో జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులు చేశారు. జగనన్న గోరుముద్ద పేరిట మెనూ పూర్తిగా మార్చి విద్యార్థుల సమగ్ర ఎదుగుదలకు అవసరమైన ఆహారాన్ని అందిస్తున్నారు. ఇప్పుడు మరో ముందడుగు వేసి వారంలో మూడు రోజులు అనగా మంగళవారం, గురువారం, శనివారం విద్యార్థులందరికీ బెల్లంతో చేసిన రాగి జావ అందించనున్నారు.

నియోజకవర్గాల్లో ఇలా...

పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో 111 జెడ్పీ హైస్కూళ్లల్లో 6 నుంచి పదో తరగతి వరకు 38 వేల మంది, 658 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 27 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో సుమారుగా 70 శాతం మంది జగనన్న గోరుముద్ద స్వీకరిస్తున్నారు. విద్యార్థులు ఇష్టపడేలా.. సాధారణంగా రాగిజావలో పెరుగు కలుపుకుని తాగుతారు. అయితే ఆ విధంగా చేస్తే పెరుగు కొంచెం పుల్లగా ఉండడం వల్ల విద్యార్థులు తాగేందుకు ఆసక్తి చూపరు. అందుకే పెరుగు బదులు బెల్లం కలిపి ఇవ్వడం వల్ల రాగిజావ తియ్యగా ఉండి విద్యార్థులు తాగేందుకు ఇష్టపడతారని ఈ విధానాన్ని సీఎం జగన్ అమలు చేశారు. ప్రభుత్వమే నాణ్యమైన బెల్లం, రాగి పిండి పంపిణీ చేస్తుంది. దీంతో విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అంది వారి సమగ్ర ఎదుగుదలకు సహకరిస్తుంది.

మెనూ ఇలా..

- సోమవారం : వెజ్ పలావు, కూర, గుడ్డు, చిక్కీ
- మంగళవారం : రాగిజావ, పులిహోర, టమాట లేదా దొండకాయ పచ్చడి, గుడ్డు
- బుధవారం : వెజ్ పలావు, బంగాళదుంప కూర, గుడ్డు, చిక్కీ
- గురువారం : రాగిజావ, సాంబారు అన్నం, గుడ్డు
- శుక్రవారం : పప్పు, ఆకుకూర, అన్నం, గుడ్డు, చిక్కీ
- శనివారం : రాగిజావ, ఆకు కూరతో తయారు చేసిన అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగల్.

పోషకాలు పుష్కలం



జగనన్న గోరుముద్ద, రాగిజావ పథకంలో ఇస్తున్న ఆహారంలో ఐరన్, కాల్షియం, పొటాషియం అధికంగా ఉండి, కొవ్వు పదార్థాలు తక్కువగా ఉంటాయి. ఇవి పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో బలంగా ఎదిగేందుకు సహాయపడతాయి. పోషకాహార లోపంతో రక్తహీనతతో బాధపడుతున్న వారికి జగనన్న గోరుముద్ద, రాగిజావతో ఆ సమస్య పూర్తిగా తొలగిపోతుంది.

– వి.గౌతమి, పీహెచ్‌సీ వైద్యాధికారి, అంబాజీపేట

స్వచ్ఛందంగా తాగుతున్నారు



రాగిజావ పోషక విలువలను విద్యార్థులు తెలుసుకుని వారే స్వచ్ఛందంగా తాగేందుకు ముందుకు వస్తున్నారు. రాగిజావ వల్ల ఆరోగ్య సమస్యలు ఉండవు. మంచి ఫలితాలు ఉంటాయని విద్యార్థులకు అవగాహన కల్పించాం. ఉదయం 10.30 గంటలకు విద్యార్థులకు రాగిజావ ఇస్తున్నాం. జగనన్న గోరుముద్దను విద్యార్థులు ఎంతో ఇష్టంగా తింటున్నారు.

– ఏఎల్ వరప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు, పుల్లేటికుర్రు

చెత్త సమస్యకు తాత్కాలిక పరిష్కారం



మాచవరంలో చెత్త వేసేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ముక్కంటి

అంబాజీపేట: మాచవరం పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను డంపింగ్ చేసేందుకు తాత్కాలిక పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి చెప్పారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో చెత్త సమస్యపై అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. గ్రామంలో చెత్తను తరలిస్తున్న మాచవరం, హడ్కో కాలనీలలో కాకుండా ప్రభుత్వ భూముల వివరాలపై తహసీల్దార్ టి.మంగతాయారు, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, ఈఓపీఆర్డీ బి.మమత, కార్యదర్శి కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. పీర్మాయిపాలెంలో కౌశిక వంతెన వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించగా వేరే పంచాయతీకి చెందడంతో అధికారులు వెనుదిరిగారు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు అందుబాటులో లేకపోవడంతో ఈ నెల 6న సమావేశం నిర్వహించి చెత్తను డంపింగ్ చేసేందుకు శాశ్వత పరిష్కారంపై చర్చిస్తామన్నారు. మాచవరం శివారు కొత్తపాలెం కౌశిక వద్ద చెత్తను తాత్కాలికంగా తరలిస్తామన్నారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని గత రెండు వారాలుగా పేరుకుపోయిన చెత్తను తొలగించి పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించామన్నారు. పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు మాత్రమే తాత్కాలికంగా డంపింగ్ చేస్తున్నామన్నారు. గ్రామ పెద్దలు, కాలనీవాసులతో చర్చించిన అనంతరం యథావిధిగా రెండు ప్రాంతాల్లో చెత్త వేసేలా ప్రయత్నం చేస్తామని ఆర్డీఓ వివరించారు. ఆర్డీవో వెంట ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వోలు రమేష్, రమణ, సర్వేయర్లు పాల్గొన్నారు.

మ్యాజిక్ సోక్ పిట్స్‌తో సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ



రావులపాలెంలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నరసింహారావు

రావులపాలెం: జగనన్న కాలనీల్లో నూతనంగా నిర్మించనున్న మ్యాజిక్ సోక్‌పిట్స్‌తో సంపూర్ణ పారిశుధ్యం సాధించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ బీవీఎల్ నరసింహారావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశం హాలులో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో కొత్తపేట నియోజకవర్గంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు మ్యాజిక్ సోక్‌పిట్స్ నిర్మాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ జగనన్న కాలనీ లే-అవుట్‌లలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన చోట్ల మ్యాజిక్ సోక్‌పిట్స్ నిర్మించాలన్నారు. రావులపాలెం, ఆలమూరు, ఆత్రేయపురం, కొత్తపేట మండలాలకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు సోక్‌పిట్స్ నిర్మాణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్, రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీర్లు కేవీవీ సత్యనారాయణమూర్తి, పి.పద్మ, ఎం.పోశమ్మ, వై.శ్రీధర్, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్లు వి.వెంకటరెడ్డి, ఎస్.జేజిబాబు, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుటుంబ ఆరోగ్య సర్వే

కొత్తపేట: మండలంలోని పలు గ్రామాల్లో కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సర్వే (ఐఐపీఎస్) సంస్థ ఐదేళ్లకోసారి నిర్వహించే ఈ సర్వేలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణలో సిగ్మా రీసెర్చ్ కన్సల్టెన్సీ ఏజెన్సీ బృందం అవిడి పీహెచ్‌సీ పరిధిలోని కొత్తపేట రామయ్యవీధి ఏరియాను, వానపల్లి పీహెచ్‌సీ పరిధిలోని వానపల్లి శ్రీనివాసపేట ప్రాంతాన్ని ర్యాండమ్ సర్వేకు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో 150 కుటుంబాలను సర్వే చేస్తారు. ఆ మేరకు సోమవారం సర్వే స్టేట్ కోఆర్డినేటర్ జ్యోతి, సూపర్‌వైజర్ కె.గోవిందయ్య ఆధ్వర్యంలో బృందం సర్వే చేపట్టారు. సర్వే వివరాలను ఐఐపీఎస్‌కు నివేదిస్తామని గోవిందయ్య తెలిపారు. ఈ సర్వేలో అవిడి, వానపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు రవికుమార్, కేఎస్ఎస్ హర్ష, ఎంపీహెచ్ఈఓ బీవీవీ సత్యనారాయణ, ఎంపీహెచ్ఏ వాడ సద్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన



పెనికేరులో క్షయవ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో కలవచర్ల, నవాబుపేట, పెనికేరు గ్రామాల్లో సోమవారం వైద్యారోగ్య సిబ్బంది క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెచ్ఈ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎన్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి ఆధ్వర్యంలో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షయ వ్యాధి నియంత్రణకు ఆధునిక వైద్య చికిత్స అందుబాటులో వచ్చినందున రోగగ్రస్తులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ఏఎన్ఎంలు వి.రమణ, టి.సుశీల, కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు ప్రారంభం



కొత్తపేటలో పరీక్షకు హాజరయ్యే ముందు సరస్వతిదేవికి నమస్కరిస్తున్న విద్యార్థినులు



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ ముక్కంటి

మామిడికుదురు: మండలంలోని ఆరు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 12 ఉన్నత పాఠశాలలకు చెందిన మొత్తం 1065 మంది విద్యార్థులకు గాను 1055 మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్షలకు హాజరయ్యారు. 10 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. మండల కేంద్రం మామిడికుదురు, పాశర్లపూడి, అప్పనపల్లి, లూటుకుర్రు, మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు మొగలికుదురు శ్రీచైతన్య స్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. రాజోలు మండలం తాటిపాకకు చెందిన విద్యార్థులు మొగలికుదురులోని రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాశారు. మండలంలోని కరవాక స్కూల్‌కు చెందిన విద్యార్థులు మలికిపురం మండలం కేశనపల్లి స్కూల్‌లో పరీక్ష రాశారు. డీఈఓ ఎం.కుమలకుమారి మామిడికుదురు, మొగలికుదురు, అప్పనపల్లి పరీక్షా కేంద్రాలను పరిశీలన చేశారు. అక్కడ చేసిన ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. ఎంఈఓ ఎం.విజయశ్రీ నేతృత్వంలోని ఫ్లైయింగ్ స్క్వాడ్ మామిడికుదురు పరీక్షా కేంద్రాన్ని పరిశీలించింది. పటిష్టమైన బందోబస్తు మధ్య మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

రావులపాలెంలో..

రావులపాలెం: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలోని ఆరు కేంద్రాల్లో తొలిరోజు 1,174 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1,159 మంది పరీక్షలకు హాజరైనట్టు 15 మంది గైర్హాజరైనట్టు ఎంఈఓ ఎం.హరిప్రసాద్ తెలిపారు.

రాజోలులో..

రాజోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సోమవారం మంది విద్యార్థులు హాజరయ్యారు. మండలంలోని రాజోలు బాలుర, బాలికోన్నత, కడలి, శివకోటి, పొన్నమండ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పబ్లిక్ పరీక్ష రాసేందుకు విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకున్నారు. మొత్తం 1024 మంది విద్యార్థులకు గాను తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 1023 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈఓ ఎం.విజయశ్రీ తెలిపారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: పదో తరగతి పరీక్షలు 759 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ జేవీకేదుర్గ తెలిపారు. మండలంలోని మొత్తం ఐదు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరగ్గా మొదటి రోజు 761 మంది విద్యార్థులకు 759 మంది హాజరైనట్లు ఆమె తెలిపారు.

ఏడుగురు విద్యార్థుల గైర్హాజరు

అంబాజీపేట: మండలంలో సోమవారం జరిగిన పది పబ్లిక్ పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు ఎన్.సత్యనారాయణ డి.శ్రీనివాసవరప్రసాద్, బి.చిరంజీవి తెలిపారు. మొత్తం మూడు సెంటర్లలో 529 విద్యార్థులకు గాను 522 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏడుగురు విద్యార్థులు తొలిరోజు తెలుగు పరీక్షలకు గైర్హాజరయ్యారని ఆయా పరీక్షా కేంద్రాల అధికారులు తెలిపారు.

అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న పది పరీక్షలను కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు పరీక్ష రాసే రూమ్ వివరాలను క్లుప్తంగా ఉంచాలన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ టి.మంగతాయారు, ఆర్ఐ ఎండీ ఇబ్రహీం ఉన్నారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: పది పరీక్షా కేంద్రాలకు 99.3 శాతం విద్యార్థులు హాజరైనట్లు ఎంపీడీవో నాతిబుజ్జి తెలిపారు. మండలంలోని ఆత్రేయపురం, ర్యాలి, పేరవరం గ్రామాల్లో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాలను ఎంపీడీవో నాతిబుజ్జి, తహసీల్దార్ అనిల్‌కుమార్, సీఐ రజనీకుమార్, ఎస్సై సుధాకర్, ఎంఈవో వర ప్రసాద్ పరిశీలించారు. ఎంపీడీవో నాతిబుజ్జి మాట్లాడుతూ మండలంలో పదో తరగతిలో 634 మంది విద్యార్థులకు గాను 630 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కొత్తపేటలో..

కొత్తపేట: మండలంలోని 5 పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు పరీక్షకు సంబంధించి 914 మంది విద్యార్థులకు 911 మంది హాజరయ్యారు. వారిలో 456 మంది బాలురు, 455 మంది బాలికలు ఉన్నారు. ఆయా సెంటర్లలో ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు పర్యవేక్షణలో ఇన్విజిలేటర్లు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల కోసం ఆయా సెంటర్లలో వానపల్లి, అవిడి పీహెచ్‌సీల సిబ్బంది వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. తాగునీరు తదితర సౌకర్యాలు సమకూర్చారు. ఎస్సై వి.మణికుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు 839 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ కోన హెలీనా తెలిపారు. పి.గన్నవరం, ముంగండ, నరేంద్రపురం, మానేపల్లి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 841 విద్యార్థులకు గాను, అనారోగ్య కారణాల వల్ల ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆమె వివరించారు. విద్యార్థుల కోసం పాఠశాలలో వివిధ సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు ఆమె వివరించారు.

ఆలమూరులో..

ఆలమూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలతో పాటు చెముడులంక జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాల్లో ఈపరీక్షలను నిర్వహించారు. ఈమూడు కేంద్రాల్లో 805 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 43 మంది విధుల నిర్వహించారు. అందులో 37 మంది ఇన్విజిలేటర్లు, ముగ్గురు ఉన్నతాధికారులు సేవలందించారు. అందులో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 663 కాగా, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 142 మంది విద్యార్థులు ఉన్నట్లు ఎంఈఓ డి.మురళీ సత్యనారాయణ తెలిపారు.



రాజోలులో పరీక్షా కేంద్రం వద్ద తమ హాల్‌టికెట్ నంబర్ పరిశీలించుకుంటున్న విద్యార్థులు



మొగలికుదురు పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులు

స్పందన ద్వారా సమస్యల పరిష్కారం

ఆత్రేయపురం: ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, ఎంపీడీవో నాతిబుజ్జి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నాలుగు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, ఎంఈవో వరప్రసాద్, ఏవో పట్టాభిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్ల సమావేశం

అంబాజీపేట: నియోజకవర్గ స్థాయి సచివాలయ కన్వీనర్ల సమావేశం పి.గన్నవరం పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని మండల జేసీఎస్ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నున్నారన్నారు. మండలంలోని సచివాలయ కన్వీనర్లు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అంబాజీపేట: ముక్కామల సబ్‌స్టేషన్‌లో పరిధిలో ఉన్న గ్రామాలకు మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ సోమవారం తెలిపారు. ముక్కామల, వక్కలంక, పసుపల్లి రోడ్డు వైండింగ్ పోల్స్ జరిపే నిమిత్తం విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఎ.హరిబాబు కోరారు.

నేటి నుంచి వంతు నీటి సరఫరా

కొత్తపేట: మండలంలోని వాడపాలెం ఓల్డ్, న్యూ చానల్స్ ద్వారా మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి 6వ తేదీ (గురువారం) సాయంత్రం 6 గంటల వరకూ (48 గంటలు) నీరు సరఫరా చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ కొత్తపేట సెక్షన్ అధికారి వి.నవీన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వంతుల వారీ సాగునీటి సరఫరాలో భాగంగా సరఫరా చేస్తున్న సాగునీటిని ఆయా చానల్స్ కింద వరి సాగు చేస్తున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరం మేరకు పంట బోదెలు బాగుచేసుకుని నీరును చానల్ చివరి భూముల వరకు తీసుకువెళ్లి వినియోగించుకోవాలని కోరారు.

6న దుర్గమ్మకు వసంతోత్సవం

మామిడికుదురు: పెదపట్నంలంక కనకదుర్గమ్మకు ఈ నెల 6వ తేదీ గురువారం వసంతోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సోమవారం తెలిపింది. ఉదయం 9.15 గంటలకు దుర్గమ్మకు ఏకాదశ రుద్రాభిషేకం, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, నవదుర్గారాధన, అభిషేకాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అమ్మవారికి లక్ష చామంతి పూజ, లలితా హోమం జరుగుతుందన్నారు. ఈ పూజలకు భక్తులు హాజరు కావాలని ఆలయ కమిటీ కోరింది.

ప్రహరీని ఢీకొట్టిన ఆటో

అంబాజీపేట: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం సమీపాన సోమవారం ఓ ఇంటి ప్రహరీని ఆప్పీ ఆటో బలంగా ఢీకొట్టింది. రావులపాలెం నుంచి అమలాపురం వెళుతున్న ఆటో అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న ఓ ఇంటి ప్రహరీగోడను బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ దేసిరెడ్డి శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సాయంతో 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చిన్నారికి నగదు సాయం

అంబాజీపేట: కాళ్ల ఆపరేషన్ కోసం ఓ చిన్నారికి పి.గన్నవరం మండలం ముంజవరంకు చెందిన దైవాల రాంబాబు, చిన్నల ఆధ్వర్యంలో నగదు సాయాన్ని సోమవారం అందించారు. చర్చి పాస్టర్ ఎల్.జోసెఫ్ చేతుల మీదుగా రూ.5 వేల నగదును మాచవరం శివారు పోతాయిలంకకు చెందిన ఆరేళ్ల ఈతకోట సాత్విన్ తండ్రి వెంకట్‌కు అందజేశారు. తన కుమారుడు సాత్విన్ వైద్యానికి సహకరిస్తున్న దాతలకు వెంకట్ కృతజ్ఞతలు తెలిపాడు.

చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

అంబాజీపేట: వేసవి తాపం ఉపశమనానికి దాతలు ముందుకు వచ్చి గ్రామ ముఖ్య కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి అన్నారు. పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో రూరల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా కూలింగ్ వాటర్ టిన్‌లను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అందె వెంకటముక్తేశ్వరరావు, ట్రస్ట్ చైర్మన్ యు.సురేష్, సభ్యులు వి.మూర్తి, యు.ప్రసన్న, ఎన్.సుధాకర్, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న మహిళ



బంగారు గొలుసును పోలీసుల సమక్షంలో బాధితురాలికి అప్పగిస్తున్న మల్లీశ్వరి

ఆలమూరు: మండలంలోని చింతలూరులో జరుగుతున్న నూకాంబిక అమ్మవారి తీర్థోత్సవాలకు అయినవిల్లికి చెందిన యడ్ల సత్యవేణి తన కుటుంబసభ్యులతో వచ్చింది. అయితే క్యూలో వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ మెడలో ఉన్న మూడు కాసుల బంగారు గొలుసు పడిపోయింది. అంతలో ఆ గొలుసు నిడదవోలు మండలం తాళ్లపాలెం గ్రామానికి చెందిన సింగులూరి మల్లీశ్వరికి దొరికింది. దీంతో ఆమె లభ్యమైన గొలుసును నేరుగా పోలీసుస్టేషన్‌కు వచ్చి ఎస్సై ఎస్.శివప్రసాద్‌కు అప్పగించింది. అప్పటికే ఆ గొలుసు పడిపోయిన విషయంపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఆ గొలుసును బాధితురాలు సత్యవేణికి సోమవారం అప్పగించారు. నిజాయితీగా అప్పగించిన మల్లీశ్వరిని పోలీసులు ఘనంగా సత్కరించారు.